24న పాలిసెట్

మెదక్ మున్సిపాలిటీ, మే 18: ఈనెల 24వ తేదదీన పాలిసెట్-24 నిర్వహిస్తున్నట్లు మెదక్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, సిద్ధార్థ్ ఆదర్శ జూనియర్ కళాశాల, సిద్ధార్థ్ మోడల్ హైస్కూల్ నాలుగు కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 1573 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మే 18: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో 2024-25 సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా 1వ తరగతిలో 59 నాన్ రెసిడెన్సియల్ సీట్లు, 5వ తరగతిలో 61 రెసిడెన్సియల్ సీట్లలో ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 5వ తరగతికి 4వ తరగతి పూర్తి చేసి ఉండాలని, నాన్ రెసిడెన్సియల్ 1వ తరగతి ప్రవేశాలకు 1 మే 2019 నుంచి మే 31, 2020 మధ్య జన్మించి ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షల లోపు ఉండాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఒక విద్యార్థికి మాత్రమే బెస్ట్ అవైలబుల్ డే స్కాలర్, రెసిడెన్సియల్ పాఠశాలల్లో అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు మీ సేవ ద్వారా పొందాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మే 18: మెదక్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ఏడాది కాల వ్యవధి గల కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్)శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ట్రేడ్, డీజిల్ మెకానిక్ ట్రేడ్‌తోపాటు 2024-26 రెండేండ్ల కాల వ్యవధి గల ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్‌లో ప్రవేశాలకు ఆసక్తి కలిగి పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు http://ititelangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి ఒక దరఖాస్తు మాత్రమే సమర్పించాలన్నారు. సీట్ల ఎంపికలో ఎస్సెస్సీ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తింపబడుతుందన్నారు. మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ వర్తిస్తాయన్నారు. సీటు పొందిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

కౌడిపల్లి, మే18: కౌడిపల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయధికారిని స్వప్న జాదవ్ తెలిపారు. శనివారం ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 4400 క్వింటాళ్లు కావాలని కోరగా 200 బస్తాలు వచ్చాయన్నారు. ఒక్కో బస్తాకు రూ.2790 ఉండగా సబ్సిడీ పోను రూ.1116కు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు జడ్పీటీసీ పరామర్శ

నిజాంపేట, మే 18: నిజాంపేటలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు ఎల్లయ్య కుటుంబీకులకు, కల్వకుంటలో అనారోగ్యంతో మృతి చెందిన నర్సింహులు కుటుంబీకులకు జడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ శనివారం పరామర్శించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ॥గ॥ ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630 / 9989554915.
NT-5279

WANTED

★Well Qualified Experienced High School Teachers for Gandhi Centenary High School, Sangareddy for Maths, English and Librarian immediatly Contact: 9491266562, 6305818044.
NT-328226

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శివ్వంపేట: ఏదులాపూర్‌లో వర్షానికి తడిసి ముద్దవుతున్న ధాన్యం

శివ్వంపేట: ఏదులాపూలో ధాన్యాన్ని కుప్పగా చేస్తున్న రైతులు

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం

శివ్వంపేట, మే 18: మండలంలోని ఏదులాపూర్ గ్రామంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తడిసిపోయింది. కొందరు రైతులు ధాన్యం కుప్పలపై సంచులు కప్పినా ధాన్యం తడిచింది. అధికారులు స్పందించి ధాన్యం త్వరగా కొనుగోలు చేసి తమ ఇబ్బందులు తీర్చాలని కోరారు.

రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలని వినతి

కౌడిపల్లి, మే 18: రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలని మండల రైతులు తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ తారాబాయికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సోమక్కపేట సొసైటీలోని భుజిరంపేట పీఏసీఎస్‌లో బస్తాకు 42.700 కిలోల తూకం వేస్తున్నారన్నారు. దీనికి తోడు లారీకి పది నుంచి 15 బస్తాలు తరుగు తీస్తున్నారంటు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు సమాచారం ఇవ్వకుండానే వారం రోజుల తర్వాత ఓటీపీలో వడ్ల తరుగు గురించి చెబుతున్నారన్నారు. ఇప్పటివరకు కేంద్రం నుంచి 30 లారీల వడ్లు లింగాపూర్ తిరుమల రైస్‌మిల్‌కు పంపించగా లారీకి 10 నుంచి 15 బస్తాలు కట్ చేస్తున్నారన్నారు. ఇదేంటని కేంద్రం ఇన్‌చార్జిని, సొసైటీ చైర్మన్‌ను ప్రశ్నిస్తే ఇష్టారీతిన మాట్లాడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం ఇచ్చిన రైతులు గాజుల సురేశ్, ఆకుల లక్ష్మయ్య, నాయికోటి భూమేశ్, చింతల ఏసు, బొగ్గుల కిష్టయ్య, సంది కిష్టయ్య, నాగారాపు అర్జున్, కౌడిపల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

కౌడిపల్లి: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌడిపల్లి రైతు

పాలన గాలికొదిలేసిన కాంగ్రెస్

మెదక్ అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

- హామీలు తుంగలో తొక్కారు
- అకాల వర్షాలతో ఇబ్బందుల్లో అన్నదాత
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- రూ.500 బోనస్ ఇవ్వాలి
- బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ అర్బన్, మే 18: కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు, పిడుగులు పడి ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తంగులో తొక్కారన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల్లో 50 శాతం కూడా ధాన్యం కొనలేదన్నారు. ఇప్పటి వరకు రైతుబంధు దిక్కులేదని, రూ.500 బోనస్ సన్న వడ్లకే అని చెప్పి మోసం చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్కడ చూసినా ధాన్యపు కుప్పలు కనబడుతున్నాయన్నారు. హెల్త్ మినిస్టర్ ఉన్న జిల్లాలో ప్రతి కేసును హైదరాబాద్ రెఫర్ చేస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి చివరి గింజ వరకు కొనుగోలు చేసిందన్నారు. రూ.15వేలు రైతుబంధును ఈ పంటకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకాన్ని మంటలో కలిపారన్నారు. కరెంటు జీరో బిల్లని చెప్పి దానిపై క్లారిటీ లేదన్నారు. సమావేశంలో జడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

నర్సాపూర్‌లో రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- 44,685 మంది రైతులకు రూ.289.28 కోట్లు చెల్లింపు
- జిల్లాలో 84 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, మే 18 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 1,94,666,640 టన్నుల ధాన్యాన్ని 44,685 మంది రైతుల వద్ద కొనుగోలు చేశామన్నారు. ఇందుకు సంబంధించి రూ.289.28 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లాలోని 34 బాయిల్డ్ మిల్లులకు, 23 రా మిల్లులకు ధాన్యం కేటాయించామన్నారు. మెదక్ జిల్లా నుంచి సిద్దిపేట జిల్లాకు 10,000 మెట్రిక్ టన్నులు, మహబూబ్‌నగర్ జిల్లాకు 40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపించినట్లు తెలిపారు. జిల్లాలో సుమారుగా 600కు పైగా లారీలు అందుబాటులో ఉన్నాయని, ఇతర జిల్లాల కోసం 150 లారీల వరకు తెప్పించామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 84 సెంటర్లలో ధాన్యం కొనుగోలు పూర్తయ్యాయన్నారు. మరో రెండు రోజుల్లో సుమారు 100 సెంటర్లు కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు.

ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలి

నర్సాపూర్,మే18ః రైస్‌మిల్లుకు వచ్చిన లారీలోని ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలని, ఎక్కువ మంది హమాలీలను సమకూర్చుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ రైస్‌మిల్లర్లకు ఆదేశించారు. శనివారం నర్సాపూర్‌లోని శివసాయి రైస్‌మిల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. రైస్‌మిల్‌కు ఇంతవరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కేటాయించారు, ఎంత తీసుకున్నారు అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, రైస్‌మిల్లర్లు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాల హాల్‌ను, మూడంచెల భద్రత పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, ఆర్ఐ ఫైజల్ ఉన్నారు.

టీఎస్ స్థానంలో 'టీజీ'గా మార్చాలి

మెదక్ మున్సిపాలిటీ, మే 18: పీఎస్‌యూ, ప్రభుత్వ రంగ సంస్థలు, ఏజెన్సీల పేర్లలో టీఎస్‌కు బదులుగా టీజీగా మార్చాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్ర అబ్రియేషన్స్ సూచించే 'టీఎస్' స్థానంలో టీజీని వినియోగించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిందన్నారు. మార్చిలో వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అనుమతులు రాగా.. తాజాగా అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో టీఎస్‌కు బదులుగా టీజీని వినియోగించుకునేందుకు అనుమతి జారీ చేసినట్లు పేర్కొన్నారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్స్, పాలసీ పేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్ల అన్నింటిపై టీజీగా మార్చాలన్నారు. చర్యలపై ఈనెల 25వ తేదీ లోపు అన్ని శాఖల అధికారులు నివేదికలు పంపాలన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద

మొక్కను నాటుతున్న జిల్లా జడ్జి లక్ష్మీ శారద

నర్సాపూర్, మే 18: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీ శారద పిలుపునిచ్చారు. శనివారం నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టును జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీ శారద సందర్శించారు. జూనియర్ సివిల్ జడ్జి అనితతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ రెడ్డి, మెంబర్స్ జిల్లా జడ్జిని సన్మానించి, మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో పీపీఆర్ రాఘవేందర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సత్యనారాయణ, సీఐ జాన్ రెడ్డి, ఎస్సై పుష్పరాజ్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వద్దు

తూప్రాన్: యావాపూర్‌లోని వీరభద్ర రైస్‌మిల్లును సందర్శిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

చేగుంట: బోనాల రైస్ మిల్స్‌ను సందర్శించిన జిల్లా వెల్ఫేర్ అధికారి బ్రహ్మాజీ,తహసీల్దార్ గియానిస్సా బేగం

చిలిపిచెడ్: కొల్చారంలో సత్యసాయి రైస్‌మిల్ తనిఖీ చేస్తున్న నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు

- జడ్పీ సీఈవో ఎల్లయ్య

తూప్రాన్, మే 18: ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని నిల్వ చేయడంలో నిర్లక్ష్యం చేయవద్దని జడ్పీ సీఈవో ఎల్లయ్య మిల్లర్లకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం తూప్రాన్ మండలం యావాపూర్‌లోని వీరభద్ర రైస్‌మిల్, ఘనపూర్‌లోని సాయినాథ్ రైస్‌మిల్, అల్లాపూర్‌లోని నవదుర్గా రైస్‌మిల్లులను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డితో కలిసి సందర్శించారు. సీఎంఆర్ రైస్ సేకరణ వివరాలు, మిల్లుల రికార్డులు, ధాన్యం నిల్వల సామర్థ్యాన్ని, లోడింగ్ అన్ లోడింగ్‌లో ఇబ్బందులపై చర్చించి, పలు సూచనలు సలహాలు చేశారు. ఆయన వెంట ఐకేపీ సిబ్బంది, ఆయా శాఖల అధికారులు తదితరులున్నారు.

ధాన్యాన్ని త్వరగా ఖాళీ చేయాలి

చేగుంట, మే 18: కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే ఖాళీ చేయించాలని, తడువ కుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా వెల్ఫేర్ అధికారి బ్రహ్మాజీ, తహసీల్దార్ గియానిస్సా బేగం అన్నారు. మండలంలోని బోనాల తదితర రైస్ మిల్లుల్లో ధాన్యం స్టాక్‌ను శనివారం పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టాలని, కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని లారీలను వెంటనే ఖాళీ చేయించి పంపించాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. వారితో ఆర్ఐ నర్సింగ్ యాదవ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సువర్ణ, రైస్‌మిల్ నిర్వాహకులు ఇమ్మడి లక్ష్మణ్, సంతోష్‌కుమార్, నర్సింహులు తదితరులున్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు జరగాలి

నర్సాపూర్, మే 18: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని సజావుగా కొనాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు రైస్ మిల్లర్లను ఆదేశించారు. శనివారం మండలంలోని పలు రైస్ మిల్లులు, కొనుగోలు కేంద్రాలను శ్రీనివాస్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్‌మిల్లుల్లో ఖాళీ స్థలం ఎంత లభ్యత ఉన్నది అనే దానిపై మిల్లుల వారీగా సామర్థ్యంతో పోల్చి చూస్తారన్నారు. బ్రాహ్మణపల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం నిల్వ, కొనుగోలు ప్రక్రియ, ట్యాబింగ్ ఎంట్రీని తనిఖీ చేశారు. ఆయనతో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్, ఏపీఎం గౌరీశంకర్, సీసీలు పాల్గొన్నారు.

వేగంగా ధాన్యం కొనాలి

చిలిపిచెడ్(కొల్చారం), మే 18: రైతుల నుంచి ధాన్యాన్ని త్వరగా కొనాలని నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు అధికారులకు ఆదేశించారు. శనివారం కొల్చారంలోని సత్యసాయి రైస్ మిల్‌ను తనిఖీ చేసి, మండలంలో ధాన్యం కొనుగోలు ఎక్కడి వరకు వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో ప్రతి గింజను కొంటామని, రైతులు దళారులకు అమ్మవద్దని తెలిపారు. కొన్న ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేయాలన్నారు. ఆయనతో తహసీల్దార్ గఫర్‌మియా, రైస్‌మిల్ యజమాని, రైతులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో చిన్నారి మృతి

ఇందు (ఫైల్)

నర్సాపూర్, మే 18: అనుమానాస్పద స్థితిలో బాలిక(7) మృతి చెందిన ఘటన మండలంలోని అహ్మద్‌నగర్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అహ్మద్‌నగర్‌కు చెందిన మల్లేశం, మంజుల దంపతులు కూలీ పనులు చేసుకుంటు జీవిస్తున్నారు. వీరికి బాలిక ఇందు(7), మరొక కూతురు ఉన్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం మల్లేశం హమాలీకి, మంజుల సెంట్రింగ్ పనికి వెళ్లింది. పని ముగించుకుని మల్లేశం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసే సరికి ఇద్దరు పిల్లలు పడుకున్నారు. వారితో పాటు మల్లేశం కూడా పడుకున్నాడు. సాయంత్రం వాళ్ల పెద్ద కూతురు ఇందును ఎంత లేపినా లేవలేదు. తండ్రి కంగారు పడి చుట్టుపక్కల వారిని పిలిచి చూడడంతో ఆ బాలిక మృతి చెందింది. పాము కాటుతోనే బాలిక మృతి చెంది ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

బానోత్ శంకర్ (ఫైల్)

శివ్వంపేట, మే 18: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతిచెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. బొజ్యతండా పంచాయతీ పరిధిలోని హరిదాస్‌తండాకు చెందిన బానోత్ శంకర్(35), అదే తండాకు చెందిన ముడావత్ రాంచందర్ ఇద్దరు కలిసి గురువారం రాత్రి గంగాయిపల్లి ఊడుగుల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలుపడుతున్న క్రమంలో బానోత్ శంకర్ చెరువులో పడిపోయాడు. గమనించిన రాంచందర్ చెరువు దగ్గర నుంచి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం స్థానికులకు చెరువు దగ్గర శంకర్ దుస్తులు కనిపించడంతో కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. దీంతో గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలించినా మృతదేహం లభించలేదు. శనివారం ఉదయం శంకర్ మృతదేహం చెరువులో తేలడంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చాముండేశ్వరీ మాతను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

చాముండేశ్వరీ మాతను దర్శించుకుటున్న హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావు

చిలిపిచెడ్, మే 18: మండలంలోని చిట్కుల్ శివారు మంజీరా నది తీరాన వెలిసిన చాముండేశ్వరీ అమ్మవారిని హైకోర్డు జడ్జి శ్రీనివాస్‌రావు శనివారం దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు ప్రభాకర్‌శర్మ, సుబ్రహ్మణ్యశర్మ, మోతీలాల్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జి వెంట నర్సాపూర్ సివిల్ జడ్జి అనిత, చిలిపిచెడ్ ఎస్సై షేక్ మహబూబ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటాం

బాధిత కుటుంబానికి చెక్‌ను అందజేస్తున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, మే 18: మెదక్ పట్టణంలో విధులు నిర్వహించే హెడ్ కానిస్టేబుల్ భీమన్నగారి యాదగిరి గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి శాఖాపరంగా రావాల్సిన బెనిఫిట్స్‌ను చెక్కు రూపంలో ఎస్పీ బాలస్వామి అందజేశారు. ఏ ఇబ్బంది ఎదురైనా తమని కలువాలని, అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఏవో లక్ష్మీ లావణ్య లత, తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీలో ముగిసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న యాజమాన్యం

నర్సాపూర్, మే 18: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరం, కృత్రిమ మేధస్సు కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణలో భాగంగా మొదటి రోజు కంప్యూటర్ సమాచారం, దాని భాగాలు, ఉపయోగాలు, ఇంటర్‌నెట్, ఈ-మెయిల్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 180 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డా.రవీంద్రబాబు, కళాశాల డైరెక్టర్ డా.లక్ష్మీప్రసాద్, ఐటీ విభాగాధిపతి డా.దశరథ రామయ్య, శిబిరం కో-ఆర్డినేటర్ అమరేందర్‌రెడ్డి, మేనేజర్ బాపిరాజు, ఏవో అశోక్‌రెడ్డి, ఆర్గనైజర్స్ తుకారాంరెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల బాధ్యత హెచ్‌ఎంలదే



మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

నర్సాపూర్, మే 18: అమ్మ ఆదర్శ పాఠశాలకు సంబంధించిన పనులన్నీ ఈ నెల చివరి వరకు పూర్తి చేసి, పెయింటింగ్ రెడీ చేయాలని, ఏఈ సహకారంతో పూర్తి చేయాలని లేని పక్షంలో హెచ్‌ఎంలదే బాధ్యత వహించాలని డీఈవో రాధాకిషన్ హెచ్చరించారు. శనివారం నర్సాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలకు సంబంధించిన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంఈవో బుచ్చానాయక్, సెక్టోరియల్ ఆఫీసర్ సుదర్శన్ మూర్తి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్, సీఆర్పీలు భైరవరెడ్డి, రాధాగోపాల్, విశ్వకాంత్, రాజశేఖర్, హరాసింగ్, రవీందర్, సుజాత, నర్సాపూర్, శివంపేట్, కౌడిపల్లి, చిలిపిచెడ్ మండలాలకు సంబంధించిన కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కొలుపు కళాకారులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేయాలి

పాపన్నపేట, మే 18: దుబ్బుల కొలుపు కళాకారులకు ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఏడుపాయల్లో దుబ్బుల కొలుపు కళాకారులతో కలిసి మహాకొలుపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొలుపు వృత్తిని సాంస్కృతిక శాఖలో భాగంగా గుర్తించాలన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన కళాకారులకు రూ.10 లక్షల ఉచిత జీవిత బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొలుపు రాష్ట్ర యూనియన్ కోశాధికారి బోగిరి ఆనంద్, జనగారి లక్ష్మణ్, సంపత్, గిరుగుల సమ్మయ్య, రవీందర్ ఉన్నారు.

కార్మికులను నిలువు దోపిడీ చేస్తున్న బీడీ కంపెనీ

చేగుంట, మే 18: బీడీ కార్మికులను ఉత్తం బీడి కంపనీ యాజమాన్యం నిలువు దోపిడీ చేస్తున్నదని రాష్ట్ర బీడీ కామ్‌గార్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు లక్ష్మణ్, సలహాదారు గంగాధర్ పేర్కొన్నారు. చేగుంటలో వారు మాట్లాడుతూ 15 ఏండ్ల క్రితం రామాయంపేటలో ఉత్తం బీడీ కంపెనీ ఏర్పాటు చేసి, 60 బ్రాంచ్‌లు విస్తరించిందన్నారు. ఒక్కో బ్రాంచ్‌లో 60 నుంచి 70 మంది బీడీ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు 15 రోజుల పీఎఫ్ కట్ చేసి, మిగితా 15రోజులు నాన్ పీఎఫ్ కార్మికులుగా పని చేయించుకుంటున్నారన్నారు. 15 ఏండ్లుగా ఈ రకమైన దోపిడీ జరుగుతున్నదని, దీంతో కార్మికులకు రూ.50 కోట్లు నష్టపోయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించు కోవడంలేదని, దీంతో పాటు ప్రతి బ్రాంచ్‌లో 20 నుంచి 30 మంది నాన్ పీఎఫ్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. మూడు, నాలుగు గ్రామాల్లో ఫారెస్టు, ఎక్సైజ్ అధికారుల అనుమతులు లేకుండా, ఆకు, తంబాకు, ముడి సరుకు సరఫరా చేస్తున్నారన్నారు. కార్మికులకు వెయ్యి బీడీలకు 650 గ్రాముల ఆకు ఇస్తే 4వందల బీడీలకు సరిపోవడం లేదన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని, యాజమాన్యం స్పందించి న్యాయం చేయకుంటే రిలే నిరహార దీక్షలు, ధర్నాలు చేపడుతామన్నారు.